# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 8, మార్చి 2026


# అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

★ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:** ఖానాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతున్న మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్, రహదారులుభవనాల శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, కల్వర్టులు, వంతెనల పనుల్లో జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. అటవీ శాఖ అనుమతులతో ముడిపడి ఉన్న పనుల కోసం వెంటనే పరివేశ్ పోర్టల్‌లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖానాపూర్ పట్టణ పరిధిలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సమగ్రంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్కారు భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ వెంటనే పూర్తి చేయాలని అధికారులను కోరారు. అటవీ క్లియరెన్స్ విషయంలో అధికారులు వేగంగా స్పందించాలని, అభివృద్ధికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం కావాలన్నా తాను చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. పనుల పురోగతిలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, జిల్లా అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని

# పకడ్బందీగా అమలు చేయాలి

✦ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, మార్చి 7, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 17, 31, 32, 33 వార్డులలో చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్, చైర్ పర్సన్ దావ స్వాతి, వైస్ చైర్ పర్సన్ సత్యనారాయణలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు వరకు 99 రోజుల కార్యాచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించడం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్ల క్లియరెన్స్, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో, కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, చిన్న సమస్యలు పరిష్కరించాలని మిగతా 2లో..

మహిళలు అన్ని రంగాల్లో రాణించి

# సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి

✣ ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్



**కాగజ్‌నగర్ రూరల్, ప్రభాతవార్త :** మహిళలు అన్ని రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రెండవ రోజు కాగజ్‌నగర్ పట్టణంలోని గాంధీ పార్క్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. మహిళా సాధికారత కేవలం ఆర్థికాభివృద్ధితోనే కాకుండా, సామాజిక చైతన్యంతో కూడా మిగతా 2లో..



# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం



★ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు, మహిళలకు చీరలు, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు

★ పిల్లల భద్రతే ప్రథమ ప్రాధాన్యం...

★ డ్రగ్స్ నిర్మూలనకు పోలీసుల కృషి: మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్

**వేమనపల్లి, మార్చి 07, ప్రభాతవార్త**

డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం అని మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ అన్నారు. శనివారం తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 99 డేస్ యాక్షన్ ప్లాన్‌లో ఖగ్రజా పాలన ప్రగతి ప్రణాళికగగలో భాగంగా పిల్లల భద్రత డ్రగ్స్ కు అడ్డుకట్ట, అరైవ్ అలైవ్ కార్యక్రమాలపై నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం 99 రోజుల ప్రణాళిక తీసుకోవడం జరిగింది. దానిలో భాగంగా 10 టీంల తోటి ఒక్కొక్క కార్యక్రమాన్ని చేపట్టి వాటిని ప్రజలలోకి తీసుకువెళ్లాలని సూచించారని అన్నారు. దానిలో భాగంగా పోలీస్ శాఖ వారికి రెండు అంశాలు ఇచ్చారని తెలిపారు. అందులో మొదటిది పిల్లలకు భద్రత డ్రగ్స్ కట్టడి ఏప్రిల్ 13 నుండి 18 వరకు రెండవది అరైవ్ అలైవ్ కార్యక్రమం మిగతా 2లో..

## మహిళలు అన్ని రంగాల్లో రాణించి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి

(మొదటిపేజీ తరువాయి)

సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలను మహిళలు అందిపుచ్చుకుని స్వయం సమృద్ధి సాధించాలని వారు కోరారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడీఎంఏ హైదరాబాద్ నుండి ప్రత్యేక అధికారి సాం, మున్సిపల్ చైర్పర్సన్ షమీన్ సుల్తానా, వైస్ చైర్పర్సన్ డా. కొత్తపల్లి అనిత, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ.బి. రామాదేవి,మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు, ఎస్హెచ్జీ సభ్యులు, కౌన్సిలర్లు,పట్టణ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 17వ వార్డులోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం రాంనగర్ ప్రాంతంలో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## వార్డు సభ్యులకు ముగిసిన రెండో విడత శిక్షణ

**సారంగాపూర్, మార్చి 07, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ శిక్షణలో 15 గ్రామ పంచాయతీలకు చెందిన 140 మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు. శనివారం మండల పంచాయతీ అధికారి అజీజ్ ఖాన్, మండల పరిషత్ సూపరింటెండెంట్ లింబాద్రి సభ్యులకు శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, శిక్షకులు కైలాష్, హరీష్, కృష్ణా, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ఇచ్చోడ, మార్చి 7 , ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని రైతుల సౌకర్యార్థం అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే శ్రీ అనిల్ జాదవ్ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్, సర్పంచ్ కొడప జల్లై జాకు, ఉపసర్పంచ్ శిరీష్ రెడ్డి, బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు కృష్ణ రెడ్డి, సంబంధిత శాఖ అధికారులు మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించి ప్రజలు సురక్షితంగా గమ్యం చేరే విధంగా అవగాహన కల్పించాలని సూచించారని తెలిపారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. వేమనపల్లి ప్రాంతంలో గుడుంబా ఎక్కువగా తయారు చేస్తున్నారని దానివల్ల అనారోగ్యం పాలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని సర్పంచులు చొరవ తీసుకొని గ్రామాలను గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. గంజాయి విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నట్టు మాకు సమాచారం ఉందని అలాంటివి మానుకోవాలని సూచించారు. గంజాయి వాడిన, అమ్మిన పోలీస్ వారికి సమాచారం అందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన అరైవ్ అలైవ్ కార్యక్రమం ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబాలు దెబ్బతింటున్నాయని ప్రతిరోజు జరుగుతున్న ప్రమాదాలను గుర్తుపెట్టుకుని ప్రజలలో భద్రతపై అవగాహన తప్పనిసరిగా పెరగాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ లాంటి నిర్లక్ష్యపు చర్యలే ఈ ప్రమాదాలకు కారణమని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ పరిస్థితిలోనైనా పోలీసులు ప్రజల కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని గుర్తు చేశారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాద రహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. వివిధ రకాల వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండలంలోని సుమారు 100 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలతో పాటు ఆపరేషన్లు కూడా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పురస్కరించుకొని మహిళా మణులకు చీరలు పంపిణీ చేశారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు దృష్టి సారించాలని తెలిపారు. మండలంలోని యువకులకు వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్ లు, కాంపస్ బాక్స్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ, నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, మండల సర్పంచులు మడే శ్రీనివాస్, కొట్రంగి శ్రీనివాస్, ముల్కల్ల శ్రీలత సత్యనారాయణ, దుర్గం విగ్నేష్, దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ యాక్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష

**మంచిర్యాల, మార్చి 7, ప్రభాతవార్త**



బీసీల సామాజిక రక్షణ భద్రతకై బిసి యాక్ట్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మంచిర్యాల పట్టణంలోని గాంధీ పార్క్ లో రాష్ట్ర ప్రభుత్వం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ బీసీలలో అనేక కులాలు కుల వివక్షకు గురైనటువంటి కులాలు అనేకమైన సంచార జాతులు అర్ధ సంచార జాతుల కులాలు ఊరికి ఆమడ దూరంలో జీవిస్తున్న సందర్భం దేశానికి స్వతంత్రం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బీసీలపై వివక్ష కొనసాగుతోంది. అలాగే దేశంలో రాష్ట్రంలో అనేక సందర్భాలలో బీసీ మహిళలు అత్యాచారాలకు గురై హత్యకు గురై ఉన్న సందర్భాలు ఉన్నాయి అలాగే కొన్ని కులాలను వెలివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి రాష్ట్రంలో బీసీలపై అనేక దాడులు జరిగిన నేపథ్యంలో బీసీల సామాజిక రక్షణ భద్రతకై బీసీ యాక్ట్ ఎంతో అవసరం అని తెలియజేస్తూ ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బీసీ యాక్ట్ పై చట్టం చేయాలని డిమాండ్ చేస్తున్నామని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుమ్ముల శ్రీనివాస్,రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, కర్రే లచ్చన్న, వేముల అశోక్,రామగిరి రాజన్న చారి, చంద్రగిరి చంద్రమౌళి, పరిష శ్రీనివాస్, ఆరెందుల రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

**ఇచ్చోడ, మార్చి 07, ప్రభాతవార్త:**

మండలంలోని దుబార్ పేట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్, స్థానిక సర్పంచ్ కాత్లె ప్రమీల విఠల్‌తో కలిసి భూమి పూజ చేశారు. రూ. 10 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో భాగంగా విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్, దుబార్ పేట్ సర్పంచ్ కత్లె ప్రమీల విఠల్, గ్రామ పటేల్ సలాం నాగోరావు, ఉపసర్పంచ్ సిడం ఆనంద్ రావు, గేర్జం సర్పంచ్ ప్రకాశ్, అడేగాం సర్పంచ్ అనసూయ పోతారెడ్డి, ధర్మపురి సర్పంచ్ విశ్వనాథ్, ఇచ్చోడ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్యం నారాయణ రెడ్డి పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, నాయకులు బద్దం పురుషోత్తం రెడ్డి, సద్దాం, ఆశన్న, షబ్బీర్, హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# సమాజ అభివృద్ధికి మహిళల పాత్ర కీలకం

**★ మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ సంబరాలు ★మహిళల సాధనలకు గౌరవం-లింగ సమానత్వంపై అవగాహన అవసరం ★సావిత్రిబాయి పూలే సేవలను స్మరించిన కమిషనర్ రాయలింగు**



మందమర్రి, మార్చి 7, ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, కార్యాలయ మహిళా సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయడం, పాటలు పాడడం, ఆటల పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలతో మహిళా దినోత్సవాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు పాల్గొని మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి గుర్తించిందని తెలిపారు. మహిళల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో చేసిన కృషిని గుర్తించి గౌరవించేందుకు ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. 1975 సంవత్సరాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించినప్పటి నుంచి ప్రతి సంవత్సరం మార్చి 8న మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడం, మహిళల సాధనలను గౌరవించడం, మహిళా హక్కులపై అవగాహన కల్పించడం అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే సేవలను స్మరించారు. 1848లో పూణేలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా విద్యాభివృద్ధికి పునాది వేసిన మహనీయురాలిగా ఆమెను కొనియాడారు. సమాజంలో ఎన్నో అవమానాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా మహిళల విద్య కోసం కృషి చేసిన ఆమె సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్లు ఏ. రాణి, ఈ. రాజేశ్వరి, మహిళా వార్డు అధికారులు, ఆయుర్వేద వైద్యులు డా. నిరజ, ఇన్‌చార్జి టి.ఎం.సి. రఘురాం పాల్గొన్నారు. అలాగే 24 వార్డుల మెప్మా రిసోర్స్ పర్సన్లు, ఓబీలు, వివిధ వార్డుల మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాలికలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలి: సర్పంచ్ డేగ స్వప్న

జైపూర్, మార్చి 7, ప్రభాతవార్త



బాలికలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని వేలాల సర్పంచ్ డేగ స్వప్న అన్నారు. శనివారం వేలాల గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించి, కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా వార్డు సభ్యులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, సిబ్బంది ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్స్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో మహిళ దినోత్సవం వేడుకలు'

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 7, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీదేవి మాట్లాడుతు నేడు మహిళలు అన్ని రంగాలలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.వైస్ ప్రిన్సిపాల్ డా.డి.లక్ష్మీనరసింహం మాట్లాడుతు సమాజంలోని అన్ని రంగాలలో మహిళలు ముఖ్య భూమిక పోషిస్తు శాస్త్ర సాంకేతిక రంగాలలోను ముందుకు వెళ్ళడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా కళాశాలలోని మహిళా అధ్యాపకులను కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ డి.జనార్దన్, మహిళా సాధికారత విభాగం ఇంచార్జ్ బి.రోజ్ మేరి,ఐ.క్యు.ఎ.సి ఇంచార్జ్ డా.ఇ.శారద పాల్గొన్నారు.



## అధిక డిమాండ్ ఉన్న కొత్త పంట రకాలపై రైతులు దృష్టి సారించాలి


జన్నారం, ప్రభాతవార్త




అధిక డిమాండ్ ఉన్న పంటలపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ అన్నారు. ఆత్మ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ద్వారా రైతులకు మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న కొత్త వంట రకాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల వ్యవసాయ శాఖ అధికారి అంజిత్ కుమార్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని పొనకల్ రైతు వేదికలో రైతులకు వివిధ పంట రకాల సాగు విధానాలపై వివరించారు. ప్రస్తుతం మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్న వరి రకాలైన జెజిఎల్27356, ఆర్ఎన్ఆర్31479, కెఎన్ఎమ్7715 వంటి రకాలు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చీడపీడలను తట్టుకొని అధిక దిగుబడి ఇస్తాయని రైతులకు తెలిపారు. రైతులు ఈ రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. అలాగే మొక్కజొన్న పంటలో అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని చింతగూడ రైతు వేదికలో నిర్వహించారు.

## పుష్కరాల ఏర్పాట్లు పరిశీలన

లక్షెట్టిపేట, మార్చి 7, ప్రభాతవార్త



పట్టణంలోని గోదావరి వద్ద వచ్చే ఏడాది జూన్ లో నిర్వహించనున్న పుష్కరాల ఏర్పాట్లను శనివారం రోజు మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరాలు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లను చూడడం జరుగుతుంది అన్నారు. ముఖ్యంగా గోదావరి వద్ద ఎక్కువ మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు వస్తున్నట్లు గతంలో జరిగిన పుష్కరాల కంటే ఈసారి జరగనున్న పుష్కరాలకు ఎక్కువ మేరకు భక్తులు రానున్నట్లు, అందుకోసం గోదావరి పరిసర ప్రాంతాల్లో సుమారు 20 ఎకరాల వరకు పార్కింగ్ కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే 10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో పనులు కూడా చేపట్టనున్నట్లు అధికారులకు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి నరసయ్య, వైస్ చైర్‌పర్సన్ మోత్కూరి రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, కమిషనర్ విజయ్ కుమార్ ఉన్నారు.



## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన

వేమనపల్లి, మార్చి 7, ప్రభాతవార్త

వేమనపల్లి మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన నిర్వహించారు. ఎంపిడిఓ కుమారస్వామి గ్రామ సర్పంచ్ పుప్పులపు సాయి కృష్ణ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతకు ఈ భవనాలు కీలకం అని, గ్రామాల అభివృద్ధికి, మహిళల ఆర్థిక, సామాజిక పురోగతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ ప్రదీప్ కుమార్, ఏపీఎం ప్రమోద కుమారి,మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, మాజీ ఎంపీపీ కుర్ర వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.



వంటశాలలోని నిత్యావసరలను పరిశీలిస్తున్న అధికారులు

## ప్రజాపాలన కార్యక్రమాలపై అధికారుల పర్యవేక్షణ

పెంచికల్‌పేట్, మార్చి 7, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎల్లపల్లి మార్కెట్ ప్రాంతంలో చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాన్ని ఎంపీడీవో ఆల్బర్ట్ శనివారం పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం పెంచికల్ పేట్ గ్రామపంచాయతీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులు పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని లబ్దిదారులకు సూచించారు. అనంతరం పాఠశాల పరిసరాలను సందర్శించి పరిశుభ్రత పై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. నూతనంగా నిర్మిస్తున్న కిచెన్ షెడ్డు, బాలికల టాయిలెట్ల పనులను పరిశీలించారు. ఎల్లూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలను తహసీల్దార్ తిరుపతితో కలిసి సందర్శించి భోజనశాల, వంటగది, స్టోర్ గదులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యవంతమైన భోజనం అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపివో మహేందర్ రెడ్డి, ఎపివో సతీష్, సర్పంచ్ ఉస్మాన్, కార్యదర్శులు చంద్రశేఖర్, అర్చన, చంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

పెంచికల్ పేట్, మార్చి 7, ప్రభాతవార్త :

చెడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ ఆల్బర్ట్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాల విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలుపుతూ భవిష్యత్తులో ఉన్నత స్థానాలు చేరాలని ఆకాంక్షించారు. సాయిరే సాయికిరణ్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేసి వారి భవిష్యత్తు విద్యా ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, సర్పంచ్ శ్రీనివాస్, పీఆర్టీయూ టిఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

## ✧ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల, మార్చి 7, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మితమవుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టిందని, ఈ క్రమంలో పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం సాయికుంట ప్రాంతంలో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



వాసవి ఎక్సలెన్స్ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్

## మేజర్ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాలి

జన్నారం, మార్చి 7, ప్రభాతవార్త

పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ నీ అభివృద్ధి పథంలో ఇంకా ముందుకు తీసుకుపోవాలి అని వాసవి క్లబ్ సికింద్రాబాద్ కపుల్స్ అద్యక్షులు గోలి రమేష్ అన్నారు. జన్నారం మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ వాసవీ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ ఎస్.వి.ఎమ్ గ్రాండ్ హోటల్‌లో శుక్రవారం జరిగిన వాసవి క్లబ్ సికింద్రాబాద్ కపుల్స్ సమావేశంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్ధ వెంకట సూర్య ప్రకాష్ రావు చేతుల మీదుగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మా భూమేష్ ను జిల్లా ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ సికింద్రాబాద్ కపుల్స్ అధ్యక్షుడు గోలి రమేష్ సెక్రటరీ వినోద్ పసునూరి ట్రెజరర్ రవి కొండూరి తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరు అటవీ శాఖ కార్యాలయం వెనుక ఆవరణలో చెలరేగిన మంటలు

## అటవీ శాఖ కార్యాలయం ఆవరణలో అగ్నిప్రమాదం

### - మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

చెన్నూరు, మార్చి 7, ప్రభాతవార్త

చెన్నూరు పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం వెనుక ఆవరణలో శనివారం అకస్మాత్తుగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కార్యాలయం వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కార్యాలయం వెనకాల చెత్తకు నిప్పంటించడంతో అగ్ని ప్రమాదం జరిగినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమావేశం ఏర్పాటు

జన్నారం, మార్చి 7, ప్రభాతవార్త

జన్నారం మండల కేంద్రము లోని బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల జన్నారం స్కూల్ కాంప్లెక్స్‌లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక, స్కూల్ కాంప్లెక్స్ గ్రాండ్స్ గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో ప్రజలను ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగం చేయడం, ప్రజల అవసరం గుర్తించి వాటిని తీర్చడం వంటి అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ ఎమ్. శివరాజం, ఎస్‌సిఆర్‌పి రఘునాథం, కాంప్లెక్స్ సెక్రటరీ బి రాజారాం, టిడబ్ల్యూపిఎస్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

బెల్లంపల్లి, మార్చి 07, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉప కేంద్రాల్లో ఆసుపత్రులలో శుభ్రత పాటించాలని, పరిసరాల పరిశుభ్రత పైన అందరూ నడుము కట్టాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారము భీమిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి గంగా మోహన్, వైద్యాధికారి డాక్టర్ నిర్మల, డిపిఓ ప్రశాంతి, ఆర్ఎస్ పద్మ జగపతి, ఆరోగ్య ఆశా కార్యకర్తలు బుక్క వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యానికి శాఖ అధికారిని మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో శుభ్రత పాటించాలని అదేవిధంగా పరిసరాల పరిశుభ్రత పైన అవగాహన కలిగించాలని, గ్రామ పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి అన్ని పరీక్షలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉమా శంకర్, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పేదల గృహ నిర్మాణానికి అండగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ కృషి

### - సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెల్లి రమేష్

బెల్లంపల్లి, మార్చి 07, ప్రభాతవార్త




బెల్లంపల్లి పట్టణంలోని 12వ వార్డు కాల్ టెక్స్ ఏరియాలో ఖుర్షిద్ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో భాగంగా స్లాబ్ వేసే కార్యక్రమాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు నెల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా నెల్లి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు నిజంగా అర్హులైన పేద కుటుంబాలకు ఉపయోగపడేలా బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కృషి చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజల ఇళ్ల కల సాకారం కావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. అలాగే 12వ వార్డు అభివృద్ధి కోసం, పేద ప్రజల అవసరాల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవ చేస్తానని, ఏ సమస్య వచ్చినా ప్రజల వెంట ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు శివారపు ఈశ్వరక్క, నెల్లి సమ్మన్న, నూనె ప్రభాకర్, షమీమ్ భాయ్, అలాగే బస్తీ పెద్దలు మాధవరావు, గాండ్ల సత్తన్న, మూట రమేష్, కట్ల అశోక్, బొల్లు రమేష్, చందనగిరి శ్రావణ్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## రక్త దానం చేయండిప్రాణ దాతలుగా మారండి

### - హెల్ప్ ఇన్ నీడ్ ఫౌండర్ క్రాంతి కుమార్

జైపూర్, మార్చి 7, ప్రభాతవార్త



ప్రాణపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి రక్తదానం చేసి పలువురికి ప్రాణ దాతలుగా మారండి అని హెల్ప్ ఇన్ నీడ్ ఫౌండర్ రామ్ క్రాంతి కుమార్ యువతను కోరారు. ఆయన ఇప్పటి వరకు 29 సార్లు రక్తదానం చేసి, శనివారం మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సికిల్ తలసేమియా పిల్లల కొరకు 30 వసారి రక్తదానం చేసి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్‌తో మాట్లాడగా ఆయన పలు విషయాలను విలేఖరులతో పంచుకున్నారు. 2015 నుండి రక్త దానం చేస్తూ ఉన్నట్లు తెలిపారు. రక్త దానం తో పాటు నిరు పేదలకు, వృద్ధులకు, అనాధ పిల్లలకు సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేందుకు 2018లో ఖగహెల్ప్ ఇన్ నీడ్గగఅనే సంస్థ ను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం నాలుగు రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ జీతం నుండి కొంత సొమ్ము వెచ్చిస్తూ స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. యువతి, యువకులు రక్త దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో

దండేపల్లి, మార్చి 7, ప్రభాతవార్త

మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు నడిపల్లి దివాకర్ రావు అధ్యక్షతన రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు భరోసా డబ్బులు విడుదల చేయాలని శనివారం రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... రైతులకు ఎగ్గొట్టిన రైతు భరోసా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడు ఎకరాల లోపు మాత్రమే రైతు భరోసా ఇచ్చి, మిగతా రైతులకు అన్యాయం చేశారని తెలిపారు. రైతులకు వెంటనే ఎగ్గొట్టిన మూడు విడుదల రైతు భరోసాని వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేటప్పటికి రైతు భరోసా పూర్తిగా విడుదల చేయాలని లేదంటే మంచిర్యాల నియోజకవర్గ వ్యాప్తంగా రైతుల పక్షాన కలెక్టరేట్ ముట్టడి నిర్వహిస్తామని వారు తెలిపారు. రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని రైతుల కోసం పోరాడడానికి ఎల్లప్పుడూ బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చుంచు శ్రీనివాస్, దండేపల్లి మాజీ వైస్ ఎంపీపీ అనిల్, లక్షెట్టిపేట మాజీ డీసీఎంఎస్ చైర్మన్లు కేతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, తిప్పని లింగయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### * ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**హాజీపూర్, మార్చి 7, ప్రభాతవార్త**

పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 16వ వార్డు ముల్కల్లలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం. వేసవి దృష్ట్యా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, చిన్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అనంతరం పారిశుధ్య పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ రమ్య, 16వ వార్డు కార్పొరేటర్ బియ్యల త్రివేణి, కమిషనర్ అన్వేష్, వార్డు ఆఫీసర్ మహేష్, కార్పొరేటర్లు లాగిశెట్టి రాజయ్య, చింతపండు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

### - పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు

**కుబీర్, మార్చి 07, ప్రభాతవార్త:**

కుబీర్ మండలంలోని పార్డి(బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం, పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు అందరినీ అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలను పూజించిన దేశం మనది: ఎంపీఓ గోవర్ధన్

**దిలావర్‌పూర్, మార్చి 07, ప్రభాతవార్త:**

మహిళలను పూజించిన గొప్ప సంస్కృతి మన దేశానిదని ఎంపీఓ గోవర్ధన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకుని శనివారం దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలో మహిళా అధికారులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని కోరారు. నేటి సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, వారు అన్ని రంగాల్లో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులోనూ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



## సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అమోఘం: మల్లెతుల రాజేంద్రప్రాణి

### - శ్రీరాంపూర్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**నస్పూర్, మార్చి 7, ప్రభాతవార్త**

సమాజ అభివృద్ధిలో మహిళలే కీలక శక్తులు అని సింగపూర్ మాజీ సర్పంచ్ మల్లెతుల రాజేంద్రపాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీరాంపూర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రపాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాల సీఏలను ఘనంగా సత్కరించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్న మహిళల కృషిని గుర్తించి ఈ గౌరవం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోగమిస్తుందని రాజేంద్రపాణి పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, సామాజిక సేవలో మహిళా కార్యకర్తల పాత్ర కీలకమని కొనియాడారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ అధ్యక్షుడు గోపతి తిరుపతి, సతీష్ పాల్గొన్నారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై సమీక్షా సమావేశం

**సారంగాపూర్, మార్చి 07, ప్రభాతవార్త:**



మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలుపై మండల స్థాయి అధికారుల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 99 రోజుల ప్రణాళికపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. మండల స్థాయిలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఈ ప్రణాళికను విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లో ఏయే సమస్యలపై అర్జీలు స్వీకరించాలి, వాటి పరిష్కార మార్గాలు, పరిపాలనా విధానంలో ఉద్యోగులు ప్రజలతో మెలిగే తీరుపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ప్రభుత్వం సూచించిన పది అంశాల అమలులో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఎంపీఓ అజీజ్ ఖాన్, ఏపీఓ సాగర్, ఎంఈఓ మహేందర్, ఏఓ అహ్మద్, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కుకింగ్ చేస్తున్న చిన్నారులు

## ఎథిక్ అకాడమీలో చిన్నారుల కుకింగ్ విత్‌ఔట్ ఫైర్" ఆరోగ్యకర జీవనానికి అడుగు

**మంచిర్యాల, మార్చి 7, ప్రభాతవార్త:**

జన్మభూమి నగర్‌లోని ఎథిక్ అకాడమీలో చిన్నారుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించేందుకు శనివారం కుకింగ్ విత్‌ఔట్ ఫైర్" అనే వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్గి లేకుండా వంట చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం కూడా సులభంగా తయారు చేయవచ్చని చిన్నారులు తమ ప్రతిభతో చూపించారు. పాఠశాల చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని గ్రీన్ సలాడ్లు, వెజిటబుల్ సాండ్‌విచ్‌లు, స్ప్రౌట్స్ మిక్స్, లెమన్ జ్యూస్ మరియు ఇతర సహజ పానీయాలు తయారు చేశారు. రంగురంగుల కూరగాయలతో, తాజా పదార్థాలతో వారు తయారు చేసిన వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇప్పటి కాలంలో పిల్లల్లో పెరుగుతున్న జంక్ ఫుడ్ అలవాట్లకు ప్రత్యామ్నాయంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, "చిన్న వయసులోనే పిల్లల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం చాలా ముఖ్యమైన విషయం. సులభమైన పదార్థాలతో కూడా పౌష్టికాహారం తయారు చేయవచ్చని పిల్లలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం" అని తెలిపారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం చిన్నారుల్లో సృజనాత్మకత, ఆరోగ్య అవగాహన, సహకార భావం పెంపొందించడంలో ఉపయోగపడిందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి.

## ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారం కావాలి

### - మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

### - మంచిర్యాల 30వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటన

**నస్పూర్, మార్చి 7, ప్రభాతవార్త**

ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కారం కావాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో నిర్వహించిన మంచిర్యాల శుభ్రత ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్ లో పర్యటించి పారిశుద్ధం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులపై ప్రజలతో చర్చించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో సామాన్యులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం ద్వారా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజల సహకారంతో సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాలనా సౌలభ్యం కోసం డివిజన్ అధికారుల కార్యాలయాలను ఆయా డివిజన్లలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు

# విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు



## - కలెక్టర్ కుమార్ దీపక్



**లక్షెట్టిపేట, మార్చి 7, ప్రభాతవార్త**

ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టికలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...అన్ని ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, అదనపు గదులు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మార్చురీ గది నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రి లోని రోగులతో మాట్లాడుతూ కల్పిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

**సారంగాపూర్, మార్చి 07, ప్రభాతవార్త:**

మండలంలోని జామ్ గ్రామంలో గల కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి బాలిక్ అహ్మద్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని పాఠశాల ప్రత్యేక అధికారి అన్నపూర్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల వసతి గృహాన్ని, వంటశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఎంఈఓ మహేందర్ పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి పథకం శ్రీరామరక్ష: ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**బజార్‌హత్నూర్, మార్చి 07, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం కళ్యాణ లక్ష్మి ్ర, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు వారు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్కే పాండురంగ్, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళా ఉద్యోగులందరూ

# క్రీడల్లో పాల్గొనాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో మహిళా ఉద్యోగులందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. మార్చి 8 మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ జెండా ఊపి ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, మహిళలందరూ ప్రతిరోజూ క్రీడలు ఆడాలని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల కోసం లెమన్ స్పూన్, క్యారమ్స్, చెస్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, సీపీఓ జీవరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు అవగాహన

**నిర్మల్ ,ఫిబ్రవరి 07, ప్రభాతవార్త:**



నిర్మల్ పట్టణంలోని హోటల్ మారుతి ఇన్‌లో శనివారం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం గురించి వివరాలను లబ్ధిదారులకు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రుణాల పథకాలు అన్నిటిని అర్హులైన వారు సద్వినియోగపరుచుకొని ఆర్థికంగా ఎదగాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఉన్నతికి ఎన్నో రకాలైన పథకాలను అమరుపరుస్తున్నాయని అన్నారు. పేద ప్రజలు, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వ్యాపారంలో ఎదిగేలా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని చెప్పారు. ఈ పథకాల ద్వారా లబ్ధిదారులు ఉపాధి పొందడమే కాకుండా, ఇతరులకు ఉపాధి కల్పించేలా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహ రెడ్డి, ఎల్డీఎం రామ్ గోపాల్, ఇండియన్ పోస్ట్స్ మేనేజర్ వీరస్వామి, పోస్టల్ ఇన్స్‌పెక్టర్ రాజేంద్ర యాదవ్, స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం మేనేజర్ దినేష్ కుమార్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.